# నిజాయితీ

రోటరీ క్లబ్‌వారు, డైరెక్టర్స్‌బోర్డు మీటింగులో, ఆనెస్టీటెస్టు కండక్టు చేయ్యాలన్న డెసిషన్‌ను ఏకగ్రీవంగా తీసుకున్నారు.

'అయితే ఏ వయసు వాళ్ళల్లో? అన్న ధర్మసందేహాన్ని వెలిబుచ్చాడు పాస్ట్ ప్రెసిడెంట్ బుచ్చిరాయుడు. ఆయన హయాంలో ఎటువంటి ప్రయోగాలూ జరగలేదన్నది ఇప్పటికీ ఆయనకు దుగ్ధగా వుంది.

'ఏ విధంగా!' అని ప్రశ్నించాడు డాక్టర్ వరహాలరావు, ప్రెసిడెంట్ ఎలక్టు. ఇప్పటి ఆఫీస్ బేరర్స్ ఏ విధంగా ప్రయోగాలు చేసి పాప్యులర్ ఐపోతే, తనకు దెబ్బ తగులుతుందేమోనని ఆయనకు భయంగా వుంది.

లోటరీ రూలింగ్ ప్రెసిడెంట్ అడ్వకేటు పరమశివం, సెక్రటరీ సదానందం వేపు అర్థవంతంగా చూశాడు. ఆడిటర్ సదానందం గొంతు సవరించుకుని, గంభీరంగా అన్నాడు. 'ఏ వయసువాళ్ళకు అన్న ప్రశ్న అనవసరం. ఎందుకంటే పెద్దవాళ్ళలో ఆనెస్టీవుండడం, ఇసుకలో తైలంలాంటిది. ఒక వయసు వచ్చిన వాళ్ళకు శరీరం మందమౌతుంది. స్వార్థం పెరుగుతుంది. వాళ్ళు మన ప్రయోగాల పరిధిలోకి రారు. అంచేత, చిన్న పిల్లల్లో లోకం చూసీ చూడని వాళ్ళల్లో నిజాయితీశాతం ఎంత ఉందనేది మనం తెలుసుకోవాలి.'

'ఏ విధంగా' మళ్ళీ రెట్టించాడు డాక్టర్ వరహాలరావు.

'వెరీ సింపుల్!' అడ్వకేట్ పరమశివం అందుకున్నాడు. 'రెండు స్కూల్స్ సెలెక్టు చేశాం. ఒకటి బాయిస్ స్కూల్, మున్సిపాలిటీది, రెండోది గరల్స్‌స్కూల్, కాన్వెంట్‌వాళ్ళది. రెండు స్కూళ్ళలోనూ ఒక సీసాలో స్వీట్స్, ఓ డబ్బాలో పెన్సిల్స్, ఇంకో టేబిల్‌మీద ఎక్సర్‌సైజు

బుక్స్, ఇలా పెడతాం. స్వీట్ ఒక్కొంటికి పదిపైసలు, పెన్సిల్‌కు పది హేను పైసలు, ఎక్సర్‌సైజ్ పుస్తకానికి ఇరవై పైసలు. ఇట్లా ధరలు నిర్ణయించి, ఆ లిస్టును వాటి వెనకాల గోడమీద తగిలిస్తాం. అమ్మటానికి ఎవరూ ఉండరు. నిఘా వేయడానికి ఎవరూ ఉండరు. బాయ్స్ అండ్ గర్ల్స్, ఫ్రీగా వచ్చి డబ్బులు అక్కడపెట్టి తమకు కావలసినవి తీసుకుపో వచ్చు. డబ్బులు అక్కడ పెట్టకుండా, వాటిని తీసుకుపోతారూ, వెరీగుడ్, అంత శాతానికి ఆ స్కూల్లో, డిజ్ ఆనెస్టీ ఉందన్నమాట!'

'ఇది మనకు ఆర్థికంగా నష్టంకాదూ?' డైరెక్టర్స్‌లో ఒకాయన ప్రశ్నించాడు. సెక్రటరీ సదానందం అన్నాడు 'ఈ మాత్రం ఆర్థిక నష్టానికి కూడా మ ం సిద్ధపడకపోతే, ఇహ రోటరీ, లయన్స్, జేసీస్, వై మెన్స్, ఫ్రీమాసెన్స్‌లాంటి అంతర్జాతీయ సంస్థలకు అర్థమేలేదు.' కార్యదర్శిగారు నిష్ఠూరంగా అనడంతో, నష్టాన్ని గురించి ప్రశ్నవేసిన డైరెక్టర్ 'అది కాదండీ-—' అంటూ సర్దుకున్నాడు. అంతరూ టీ పుచ్చుకుని ఏకగ్రీవంగా నిజాయితీ ప్రయోగాన్ని ఆమోదించారు. ప్రయోగకర్తగా అడ్వకేట్ పరమ శివాన్నే ప్రపోజ్‌చేసి, ఎన్నుకున్నారు.

* * *

ఆడపిల్లల కాన్వెంట్ హెడ్‌మిస్ట్రెస్ మదర్ జూలియాడ్ మొదట్లో ఎక్స్‌పెరిమెంట్‌కు వొప్పుకోలేదు. 'డిసిప్లిన్‌కు మేము ఎంతో ఇంపార్టెన్స్ ఇస్తాం. మోరల్ కేరక్టర్, బిల్డప్ చేయటానికి ఎంతో కృషి చేస్తాం. ఆనెస్టీ ఈ స్కూలుకు పివట్‌లాంటిది' అన్నదామె కరెక్ట్‌గా.

సదానందం అణకువగా జవాబిచ్చాడు. 'అదంతా నిజమే మదర్! మీ స్కూలు ఎంతో పేరుపొందింది. ఉయ్ నో! అయితే క్రీస్తు దగ్గరే జూడాస్‌లాంటి వాడున్నాడే, వెయ్యిమందిపైన చదువుకునే ఈ స్కూల్లో, ఒక్క పిల్లంటే ఒక్క పిల్లకయినా టెంప్టేషన్ లేకుండా ఉంటుందా? దాన్ని కనుక్కోవడమే ఈ టెస్టు ప్రయోజనం!'

పరమశివం అందుకున్నాడు 'నాట్ ఓన్లీ దట్ మదర్! స్కేల్‌ను తెలుసుకున్న తర్వాత, ఇంటర్నేషనల్ హెడ్‌క్వార్టర్

ర్నుండీ మీకో కమెండేషన్ తెప్పిస్తాను. పేపర్లలో మీ స్కూలుకు పబ్లిసిటీ మరింతగా ఇప్పిస్తాను.'

మదర్ జూలియానా ఆ రోటేరియన్‌ల ఇద్దరివేపూ చూసింది. కాసేపు కళ్ళుమూసుకుని 'ఓకే' అన్నది చివరకు.

'థాంక్యూ మదర్!' అన్నారు ఆ ఇద్దరూ ఒక్కసారే.

మునిసిపల్ బాయిస్ స్కూల్లో అభ్యంతరం చెప్పినవాళ్ళే కనపడ లేదు. కమీషనర్ వినాయకం, 'మాపిల్లల్లో ఆనెస్టీనున్నా!' అంటూ పెద్దగా నవ్వి త్రీకాజెల్స్ సిగరెట్ ఒకటి నోట్లో పెట్టుకొన్నాడు డిగ్నిఫైడ్‌గా.

ఆ స్కూలు హెడ్మాష్టర్ శేషావతారం, వేదాంత ధోరణిలో 'వర్ణ సంకరం అయిపోయింది స్వామీ, అందుకనే గుణసంకరం కూడా అయి పోయింది. సంకర బుద్ధుల వాళ్ళకు నిజాయితీ ఎక్కడ ఏడుస్తుందీ!' అంటూ ఇంత నశ్యం తీసి నాసికారంధ్రాలకు పట్టించాడు.

స్వీట్స్, పెన్సిల్స్, ఎక్సర్‌సైజ్ బుక్స్, వాటి లిస్టులూ అన్నీ అమర్చి రొటేరియన్లు వెళ్ళిపోయిం తర్వాత, మదర్ జూలియానా, వో స్పెషల్ ప్రేయర్ మీటింగు-కమ్-ఎసెంబ్లీ కండక్ట్‌చేసి, అందరిచేతా కాన్వెం టుకు మంచి పేరు రావాలని ప్రార్థన చేయించింది. ఆ తర్వాత ఏడుగులు పడే కంఠంతో 'ఏ వొక్కరన్నా తప్పుపని చేశారా; బీ కేర్‌ఫుల్-ఆ పని నాకు తెలియకుండా వుండదు. ఆ తప్పుడు పనికి మేగ్జిమమ్ పనిష్‌మెంట్ వాళ్ళకు ఇచ్చేస్తాను. అండర్‌స్టాండ్?' అంటూ ఒక్కొక్క మాటనూ వొత్తి పలుకుతూ పురిమింది.

గొర్రెపిల్లల్లా అమాయకంగా, విచ్చుకున్న పువ్వుల్లా అందంగావున్న ఆ అమ్మాయిలు 'యస్, మదర్!' అంటూ తలలూపారు.

బాయిస్ స్కూల్లో మగపిల్లలకు వివరించిన వారూ లేరు, వారిని గురించి శ్రద్ధ తీసుకున్నవాళ్ళూ లేరు.

ప్రయోగం మొదలైంది.

* * *

రెండు స్కూళ్ళల్లోనూ స్వీట్స్, పెన్సిల్స్, ఎక్సర్‌సైజ్ బుక్స్ అన్నీ ఒక్కటీ మిగలకుండా ఖర్చయిపోయాయి. పక్కనే పెట్టిన డబ్బాల్లో చిల్లర గల్లుమంటూ పోగయింది. సాయంకాలం బాయిస్ స్కూలు విడిచే సమయానికి వో పదిమంది కౌన్సిలర్లు ఒక గ్రూప్‌గా అక్కడకు వచ్చారు. డబ్బాలోనుంచి చిల్లరతీసి లెక్కపెట్టారు. లెక్క పెట్టింతర్వాత ప్రెసిడెంట్ పరమశివం సంతోషంతో పరవశించిపోతూ అన్నాడు. 'ఒక్క పదిపైసలు మాత్రం తక్కువొచ్చింది. దట్సాల్! ఎవరో వొక్క స్టూడెంటు ఇంత పెద్ద స్కూల్లో ఒక్క స్టూడెంట్ మాత్రం నిజాయితీ లేనివాడున్నాడు. ఆ ఒక్కడుకూడా లేకుండావుంటే ఎంత బావుండేది!'

కమీషనర్ వినాయకం విప్పారిన మొహంతో, 'నన్ను నేను దిద్దుకోడానికి సంతోషిస్తున్నా! ఎండకు ఎండి, వానకు తడిసి, బెంచీల్లేకపోయినా, పై కప్పులమీద తాటాకులు గాలికి ఎగిరిపోయినా, బ్లాక్‌బోర్డుల్లేకపోయినా, మాష్టర్లు పాఠాలు చెప్పినా చెప్పక పోయినా, రకరకాల కులాల్లోంచి వచ్చి, ఒక్కటిగా ఇక్కడ కలిసి, చదువుకుంటున్న ఇంతమంది పిల్లల్లో ఇంత నిజాయితీ వుందంటే, నాకెంత సంతోషంగా వుందో మీ కెట్లాచెప్పేది? అందుకు కమీషర్‌గా——'

'మీరేం చేస్తారో మాకు తెలీదు. తాటాకులు లేచిపోయిన గదులకు మేము తాటాకులు క్లబ్బు తరపున కప్పిస్తాం!' అన్నాడు ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ వరహాలరావు.

పిల్లలందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు.

'ఆ ఒక్క కుర్రాడు కూడా పదిపైసల చాక్‌లెట్ కోసం కక్కుర్తి పడ్డవాడు, అతను కనుక ముందుకువచ్చి, ఆ పదిపైసలు కూడా పబ్లిక్‌గా జమకడితే, ఈ స్కూలుకు కావలసినవన్నీ ప్రయారిటీ బేసిస్‌లో నేను శాంక్షన్ చేయించేస్తాను.' అన్నాడు కమీషనర్ వినాయకం పెద్దగా.

'వాడెవడైనాసరే, ముందుకు రావలసిందిగా హెడ్మాష్టరుగా నేను కోరుతున్నాను. వాడొచ్చి మొహం చూపిస్తేచాలు, ఆ పదిపైసలూ నే నిచ్చేస్తాను. ఓరి వెర్రివెధవల్లారా! ఇది మన స్కూలు గౌరవం సమస్యరా!

వాడొచ్చి కనబడితే చాలు, బెంచీలు రిపేరవుతాయి, బ్లాక్‌బోర్డులు బాగు పడతాయి. ఇహనందరూ ఎండకు ఎండక్కర్లేదు, వానకు తడవక్కర్లేదు, ఏరా వో అజ్ఞాత బాలకా, ఇటురా తండ్రీ! నిన్ను నేనేం అనను— గాయత్రి సాక్షిగా!'

హెడ్మాష్టరు శేషావతారం మాటలకు వో పన్నెండేళ్ళ కుర్రవాడు లాగు సవరించుకుంటూ, మెల్లగా స్టేజిదగ్గరకు వెళ్ళాడు. సన్నగా ఏడుస్తు న్నట్టుగా. 'ఆ పదిపైసలూ ఇచ్చేయండి నాన్నారూ! నేనే ఆ చాక్‌లెట్ తీసింది' అన్నాడు.

హెడ్‌మాష్టరు శేషావతారానికి పిల్లల కలకలం వినపడలేదు. రొఉరి యన్ల గుసగుసలు వినపడలేదు. సహోపాధ్యాయుల ఎకసక్కేలు వినపడలేదు. కమీషనర్ నవ్వడం వినపడలేదు. ఓరి దౌర్భాగ్యుడా !' అంటూ కుర్చీలో కూలబడిపోయాడు. ఆ కుర్రాడికి కోపం వచ్చింది 'ఎందుకు నన్ను తిడతావు? పొద్దున్నడిగితే ఎందుకివ్వలేదూ?' అన్నాడు ముక్కు ఎగబీలుస్తూ.

రొఉరియన్లకు ఆడపిల్లల కాన్వెంటులో మరోచిత్రం ఎదురైంది. డబ్బులపెట్టెలో వుండవలసిన దానికన్నా ఇంకో రెండు రూపాయలు ఎక్కు వున్నాయి.

'మీ పిల్లలు ఓవరానెస్ట్!' అన్నాడు పరమశివం, వీలయినంత సెటైరికల్‌గా.

మదర్ జూలియానాకు ఏం సమాధానం చెప్పాలో తేలియలేదు.

తన స్టూడెంట్స్‌లో కొంత మంది డిజానెస్ట్ గరల్స్ వుంటారను కొని, వాళ్ళు తప్పకుండా కొన్ని వస్తువుల్ని కొట్టేస్తారని వూహచేసి, ఆ తప్పులో కొంతలో కొంతైనా తగ్గిదామని తానే అందులో రెండు రూపా యలు పడేస్తే, ఈ పాడు పిల్లలు సెంట్ పర్సెంట్ ఆనెస్టీ చూపించి, తన నిరకాటంలో పెట్టాడు !

'ఇన్ క్రెడిబుల్ !' అన్నాడు సెక్రటరీ సదానందం.

ఇరకాటంలో పడ్డ మదర్ జూలియానా 'అవునవును!' అంటూ తలాడించింది రబ్బరు బొమ్మలాగా, కళావిరహితంగా.

'నిజాయితీ కథకదా, నమ్మడం కొంత కష్టంగానే వుంటుంది' అన్నాడు గుంపులో ఒకరు.